క్లుప్తంగా

నేడు రథోత్సవం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో ఈ నెల 9 నుంచి శ్రీ పట్టాభి రాముల వారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం బ్రహ్మ రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో ఉభయదారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

పీలేరు : మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ పీలేరు పట్టణ శివారు ప్రాంతం కొత్తపల్లె చెరువు వద్ద అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నంబరు 2022లో వక్ఫ్‌బోర్డు, చెరువు పొరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎక్కడైనా అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వోలు శ్రీనివాసరావు, యల్లయ్య, రెడ్డిశేఖర్, సర్వేయర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కలకడ మండలం ఎనుగొండపాలెం పంచాయతీ ఎగువకురవపల్లెకు చెందిన వీరాంజనేయులు కుమారుడు అజయ్ (18) తన బంధువు బెంగళూరు నుంచి వస్తుండంతో బైక్‌లో మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని వాల్మీకిపురం బైపాస్‌రోడ్డు షిర్డిసాయిబాబా ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన ఆటో, బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో అజయ్ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. వాల్మీకిపురం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఏనుగు మల్లమ్మకు పూజలు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ విశేష అలంకరణలతో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆభరణాలు, చీర, నాగపడిగ, పసుపు కుంకమ అలకరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఏనుగుమల్లమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో అర్చకులు కార్తీక్ దీక్షిత్ గణపతి హోమం, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆరాట్ ఉత్సవం నిర్వహించారు. భజనబృంద సభ్యులు స్వామి భజనలు, భక్తిపాటలు ఆలపించారు. సాయంత్రం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

కలకడ : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అని, వ్యాధి నిర్మూలనపై విస్తృత ప్రచారం చేయాలని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జాబీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొజ్జగుంటపల్లెలో కృషి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి, రక్తపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్, టీబీ నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తోందని వ్యాధి లక్షణాలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసీ చంద్ర నాగమ్మ, కృషి సంస్థ సభ్యులు శ్రీనివాసులు, ధనలక్ష్మి, పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బ్రహ్మపుత్ర రెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి (వాల్మీకిపురం): మండలంలోని పత్తేపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నూతనకాల్వ సురేంద్ర రెడ్డి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం పత్తేపురంలో సురేంద్ర రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. వాల్మీకిపురం పట్టణంలోని బజారు వీధికి చెందిన చింత బ్రహ్మపుత్ర రెడ్డి మరణించిన సమాచారంతో వారి ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.చింతల ఆనందరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు మాతృవియోగం

మదనపల్లె సిటీ: మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్‌అజామ్ తల్లి సమీయూ ఉన్నీసా (80) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. సమీయూ ఉన్నీసా భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

పేరు పెద్దది.. ఇదేం పద్ధతి..!

- తంబళ్లపల్లె సీహెచ్‌సీలో వైద్యుల కొరత
- సకాలంలో అందని వైద్యం
- పట్టించుకోని ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న రోగులు



తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రం

తంబళ్లపల్లె: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం పేరు మాత్రం పెద్ద ఆస్పత్రి. ఈ ఆస్పత్రిలో ఎనిమిది మంది వైద్యులు ఉండాలి. కానీ ముగ్గురు మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో ప్రజలు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఆ ఆస్పత్రి దుస్థితి ఉంది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం నాబార్డు నిధులు రూ.4.65 కోట్ల అంచనాతో ఆధునాతన సౌకర్యాలతో భవనాలు నిర్మించింది. ఆ భవనాలు ప్రస్తుతం డాక్టర్లు లేక దిష్టిబొమ్మగా మిగిలింది. ఇక్కడికి తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు మండలాల నుంచి రోగులు వైద్యం కోసం వస్తారు. రోజు 200 నుంచి 300 మంది వరకు ఓపీ పేషంట్లు హాజరవుతున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చిన్న పిల్లలకు వైద్య చికిత్సలు, గర్భిణులకు నెలవారీ పరీక్షలు.. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. గైనకాలజిస్టు, అనస్థీసియన్, పీడియాట్రిషియన్ ముగ్గురు డాక్టర్లు మాత్రమే ఉన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు డాక్టర్లు డిప్యూటేషన్‌పై వెళ్లారు. మరో మూడుపోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ డాక్టర్లుదే ప్రధాన పాత్ర. అయితే ఇద్దరు డాక్టర్లు లేకపోవడంతో వైద్య చికిత్సలు అందని దాక్షలా మిగిలిపోయింది.

మృత్యువాత పడుతున్న రోగులు

ఆర్థోపెడిక్ డాక్టర్ సైతం లేకపోవడంతో చుట్టుపక్కాల ప్రాంతాల్లో ప్రమాదాల్లో గాయపడిన వారు ఆస్పత్రికి వస్తే డాక్టర్లు లేక కేవలం ప్రథమ చికిత్సలు చేసి మదనపల్లెకు రెఫర్ చేయాల్సిన పరిస్థితి. దీంతో గ్రామీణులు ఆర్థిక ఇబ్బందులు, కాలయాపన, సుదూరప్రాంతాల ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మదనపల్లె జిల్లా ఆస్పత్రికి ఇక్కడ కేసులు రెఫర్ చేయడంతో.. అక్కడికి పరిమితికి మించి రోగులు వస్తుండటంతో అత్యవసర కేసులను తిరుపతి, బెంగళూరు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో ఆస్పత్రులకు వెళ్తూ మార్గమధ్యంలో మృత్యువాత పడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇక్కడ కంటి వైద్యం అందించే అప్తాలమిస్టు వైద్యులు లేరు. గతంలో ఆయుర్వేదిక్ మందులు ఇచ్చేందుకు యునానీ విభాగాన్ని ఏర్పాటు చేసి డాక్టర్‌ను నియమించారు. ఆ డాక్టర్ కూడా బదిలీపై వెళ్లడంతో ఆ విభాగం పూర్తిగా మూత పడింది.

ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు డాక్టర్లను నియమించాలి. అన్ని రకాల వైద్య సేవలు అందే విధంగా చూడాలి. అప్పుడే గ్రామీణ ప్రజలకు కొంత ఆర్థిక వెసులుబాటు దొరకుతుంది.

–ప్రియాంక, కొటాల

ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నాం



ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు లేకపోవడంతో ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక్కోసారి వైద్యం వికటించి ప్రాణాలు మీదకు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆ పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగాఇబ్బందులుపడుతున్నాం.

–శ్రీనివాసులురెడ్డి, కుదమలవారిపల్లె

ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాం



ఆస్పత్రి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడ ముగ్గురు డాక్టర్లమే విధుల్లో ఉండటం వల్ల నైట్ డ్యూటీలు చేయడం , ప్రత్యేక కేసులపై దృష్టి సారించలేకపోతున్నాం. మరో ముగ్గురు డాక్టర్లను నియమిస్తే మరింత సేవలు అందించగలం.

–తేజస్వి, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ తంబళ్లపల్లె

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం: ప్రజా సమస్యలను పరిష్కరించి పార్టీలకతీతంగా మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ పైప్‌లైన్ నీళ్లను ప్రైవేటు వ్యక్తులు వినియోగిస్తున్నారని కోఆప్షన్ ఖాదర్‌వలి, ఆన్‌లైన్‌లో భూ వివరాలు రానందున భూ క్రయ, విక్రయాలు జరగలేదని ఎంపీటీసీ కార్యం చంద్రశేఖర్, విచ్చలవిడిగా బెల్ట్ షాపులు గ్రామాల్లో నిర్వహిస్తుండడంతో యువత పెడదోవ పడుతోందని వైస్ ఎంపీపీ పట్టిరిక శోభారాణి సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయ శాఖలో రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ప్రేమలత అన్నారు.

డిస్కం అధికారులు చొరవ చూపాలి

ప్రభుత్వ తాగునీటి బోర్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు డీడీలు చెల్లించి ఏడాది కావస్తోందని, వాటి మంజూరుకు డిస్కం అధికారులు చొరవ చూపాలని, అదే విధంగా మండలంలో నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి సూచించారు. పక్కా గృహాల మంజూరు లబ్ధిదారులు కుల, ఆదాయంతో పాటు పొజిషన్ సర్టిఫికెట్ తీసుకోవాలని హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు సూచించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ హరిహర ప్రసాద్ అన్నారు. సభ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని ఆయా శాఖల అధికారులు తెలిపారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఆర్ఎస్‌డీటీ ధనంజనేయులు, సీడీపీఓ భాగ్యమ్మతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా సగం మందికి పైగా సర్పంచ్‌లు గైర్హాజరు కావడం గమనార్హం.

ఉద్యోగాలకు ఎంపిక

పీలేరురూరల్ : స్థానిక మార్గదర్శి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కె. నాగార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం మారుతి సుజికి, జపాన్ కంపెనీ డైకాన్, అల్ట్రాయిస్ట్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 92 మంది విద్యార్థులు హాజరు కాగా 38 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌నాయుడు, డైరెక్టర్లు లోకేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, సుధానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంధనం పొదుపు ఆదాయానికి మలుపు



బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎం

పీలేరురూరల్ : ఇంధనం పొదుపు ఆదాయానికి మలుపులాంటిదని ఆర్టీసీ పీలేరు డీఎం నిర్మల అన్నారు. శుక్రవారం గ్యారేజ్‌లో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మార్చి నెలలో డిపోలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు ఎం.ఆర్. మూర్తి, వి. సిద్ధయ్యలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం

కలకడ : విద్యార్థులకు మధ్యాహ్నం బస్సు సౌకర్యం కల్పించారని కలకడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌సావల్లి తెలిపారు. గతంలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని మదనపల్లె–1 డిపో అధికారులను కోరగా బస్సును ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే బస్సు ఉదయం, సాయంత్రం మాత్రమే తిప్పేవారని పేర్కొన్నారు. మార్నింగ్ స్కూల్ నేపథ్యంలో మధ్యాహ్నం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సర్వీసును సాయంత్రం కాకుండా మధ్యాహ్నం తిప్పాలని డిపో మేనేజర్‌ను కోరడంతో ఏర్పాటు చేశారని తెలిపారు.

వీఆర్ఓ భరత్ అవినీతిపై విచారణ జరిపించాలి

మదనపల్లె : మండలంలోని కొత్తవారిపల్లె –1 వీఆర్వోగా పనిచేస్తున్న భరత్ అవినీతిపై విచారణ జరిపించాలని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు గుండామనోహర్, బహుజనయువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓ రాఘవేంద్రను వేర్వేరుగా కలిసి వీఆర్వో భరత్ అవినీతి, అక్రమ ఆస్తులపై ఫిర్యాదుచేశారు. అంకిశెట్టిపల్లె వీఆర్వోగా పనిచేస్తున్నప్పుడు గ్రామకంఠం భూముల్లో అవినీతికి పాల్పడ్డారన్నారు. అంగళ్లు వీఆర్వోగా ఉన్నప్పుడు భార్య పేరుతో ఆస్తులు సంపాదించాడని చెప్పారు. వీఆర్వో భరత్ ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు కలిగి ఉన్న విషయమై సమగ్ర విచారణ జరిపించి, విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు నాయకులు వై.చంద్రయ్య, బహుజన యువసేన నాయకులు సురేష్, ఆది, శశికుమార్, హరి, శ్రీనివాసులు, వినయ్, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై శ్రీరామచంద్రుడి విహారం



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన శ్రీ పట్టాభిరామాలయంలో తొమ్మిది రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సుప్రభాతం, తోమాలసేవ, అర్చన, సర్వదర్శనం, విశేష పూజా కార్యక్రమాలు, అనంతరం భక్తి శ్రద్ధలతో చక్రస్నానం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, శ్రీరామవ్రతమాల భక్తుల రామనామ స్మరణలతో వేదపండితులు వసంతోత్సవాలను పురవీధుల్లో వేడుకగా జరుపుకున్నారు. అనంతరం భోగోత్సవ మూర్తులైన శ్రీసీతారామలక్ష్మణులకు వేదపండితుల మంత్రోచ్ఛారణలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తజనం మధ్య చక్రస్నానం, తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఊంజల్‌సేవ అనంతరం విశేష అలంకరణలు చేసి సీతారామలక్ష్మణమూర్తులను హంసవాహనంపై నగరోత్సవం నిర్వహించగా స్వామివారిని దర్శించుకున్న భక్తులు మంత్రముగ్ధులయ్యారు. టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల కుమార్, ఆలయ అధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

నేడు పుష్పయాగం

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా చివరి రోజు శనివారం పట్టాభిరాముల వారికి పుష్పయాగం, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మెరుగైన ఆరోగ్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

నిమ్మనపల్లె : మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లి పీహెచ్‌సీ కేంద్రంలో రూ.50 లక్షల నిధులతో మెడికల్ ల్యాబ్ భవన నిర్మాణానికి స్థానిక నాయకులు అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు వైద్య పరీక్షల నిమిత్తం వాల్మీకిపురం, మదనపల్లెకు వెళ్లాల్సి వస్తుందని, అందుకోసం ఆసుపత్రి ఆవరణంలో మెడికల్ ల్యాబ్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరగా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ 41వ వార్షికోత్సవం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు, కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు సూర్యశేఖర్‌రెడ్డి, ఖాజావల్లి, మోహన్‌వల్లి, మోహన్‌బాబు, విష్ణుప్రియ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం అందజేత

మదనపల్లె : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి యూనిఫాం, పాదరక్షలు, కొబ్బరినూనె, సోపులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చాలారోజులుగా యూనిఫాం, ఇతర సామగ్రి విషయమై అనేకసార్లు వినతులు చేశారన్నారు. వీరి సంక్షేమానికి తమవంతు చేయూతను అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. మున్సిపల్ ఏఈ రూపేష్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, పూజారిచరణ్, శారదారెడ్డి, మేస్త్రీ మస్తాన్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్



వక్ఫ్‌చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న ముస్లింలు

మదనపల్లె : వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని, ముస్లింలను బెదిరించేలా ఉందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో నిసార్ అహ్మద్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 25 కోట్ల మంది ముస్లిం మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్‌చట్ట సవరణ బిల్లు రద్దు కోసం ముస్లింలంతా ఐకమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ముస్లింల ప్రయోజనాలు కాపాడటమే తమ పార్టీ లక్ష్యమని రాజ్యసభ, లోక్‌సభల్లో స్పష్టంగా చెబుతూ చట్టసవరణకు వ్యతిరేకంగా ఓటువేశామన్నారు. కేంద్రప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, బిల్లు విషయంలో కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తూ బిల్లుకు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు షమీమ్ అస్లాం, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ.కరీముల్లా, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణన బిల్లును వెనక్కి తీసుకోవాలి

భారత రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కి, కేంద్రం ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుపై నిరసన వ్యక్తం చేస్తూ, శుక్రవారం బెంగళూరు బస్టాండ్ వద్ద వీసీకే పార్టీ ఆధ్వర్యంలో మానవ హారం నిర్వహించారు. వీసీకే పార్టీ, సీపీఐ, కాంగ్రెస్, మదనపల్లె నౌ జవాన్ కౌన్సిల్, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) సభ్యులు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ నాయకులు పి.ఎల్. నరసింహులు, కోటూరి మురళి, బాస్ రాష్ట్ర కోశాధికారి నీరుగట్టి రమణ, వీసీకే, బాస్ నాయకులు చాట్ల బయన్న, ఇర్ఫాన్ పఠాన్, రెడ్డిప్రసాద్, సొన్నికంటి రెడ్డెప్ప, మదనపల్లె నౌ జవాన్ కౌన్సిల్ నాయకులు నూర్ అయాజ్, సైపావలి, అక్బర్, ఇలియాజ్, ముఖిత్, ఏజాస్ పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్ష

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో రాజ్యాంగ విరుద్ధంగా తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని సీపీఐ, ఇన్సాఫ్ ఆధ్వర్యంలో కన్వీనర్ ముబారక్ అధ్యక్షతన స్థానిక బెంగళూరు బస్టాండ్ వద్ద రెండు రోజులు పాటు రిలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్. నరసింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్, వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం. శివప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్లో వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమని, ఈ సవరణ కేవలం ముస్లిం మతం ఆర్థిక మూలాలను దెబ్బ తీయడమే అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి కే మురళి, రెడ్డి, ముభారక్,శేఖర తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు అన్నారు. శుక్రవారం స్థానిక డిపో కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండో రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలకు ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల అనారోగ్యం సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని కోరారు. ఎలక్ట్రానిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థే కొనుగోలు చేయాలన్నారు. నాయకులు ఖాజాపీర్, ఆనంద, పి.వి. నాయుడు, సి.వి. రమణ, ఆదినారాయణ, ఆదిరెడ్డెప్ప, కేకే నాయుడు, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ధర్నా

మదనపల్లె సిటీ: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక వన్,టు డిపో కార్యాలయాలు ధర్నాలు నిర్వహించారు. సీసీఎస్ ఈసీ సభ్యులు పి.వినోద్‌బాబు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డు బదులు, పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలని, ఎస్ఆర్‌బీఎస్ సంక్షేమ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ నాయకులు రాధాకృష్ణ, సుధాకర్, నగిరి మడుగు రమణ, శ్రీనివాసులు, ఎంఆర్ బాబు, చిరంజీవి, బావాజాన్, చలం, ఆచారి, మస్తాన్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

నిమ్మనపల్లె: పంట సాగులో సరైన యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని, కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వై.పీరు సాహెబ్, ఎస్.సోమశేఖర్ బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగంవారిపల్లి పరిధిలో రైతులు సాగు చేసిన వివిధ పంటలను నిమ్మనపల్లె–2 వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు తగు సూచనలు చేశారు. వరిలో చిరు సంచుల ప్రదర్శనలో ఉన్నటువంటి ఎస్ఎల్ఆర్ –3648 రకాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. మిరప పంటలను పరిశీలించి ఎండ తాకిడికి వచ్చే ముడత రోగం నివారణకు డైఫెండియురాన్ 1.5 గ్రామున్ని లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలని సూచించారు. మామిడిలో డిమాండ్ ఉన్న బెనిష, మల్లిక,ఇమామ్ పసంద్ వంటి రకానికి ఫ్రూట్ కవర్లు వాడడం ద్వారా పురుగు, తెగుళ్లు ఆశించకుండా నాణ్యమైన దిగుబడిని సాధించి, అధిక ధర పొందవచ్చని పేర్కొన్నారు.

పోషకాహారంతో సురక్షిత ప్రసవాలు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నిమ్మనపల్లె: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత అధిగమించి సురక్షిత ప్రసవాలు అయ్యేందుకు అవకాశం ఉంటుందని పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. శుక్రవారం మండలంలోని అగ్రహారంలో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా హాజరైన తల్లులకు, వృద్ధులకు జాతీయ సురక్షిత మాతృ దినోత్సవం సందర్భంగా అవగాహనా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ మాట్లాడుతూ నేటి కిశోర బాలికలే రేపటి కాబోయే తల్లులని, వారిలో రక్తహీనత దరి చేరకుండా, రాగి జావా, బెల్లం చెక్కీలు, కోడిగుడ్డు, ప్రతీ గురువారం ఐరన్ మాత్రలు ఇస్తున్నామన్నారు. టీబీపర్యవేక్షకులు నాగిరెడ్డి, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, గర్భిణులు, బాలింతలు తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్ల వయసు వచ్చే వరకు ఐసీడీఎస్ సంరక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆహార నియమాలు, రక్తహీనత నివారణ చర్యలు, అంగన్‌వాడీలకు మంజూరయ్యే పోషకాలపై అవగాహన కల్పించారు.

జ్యోతిరావు పూలే పోరాటం ఓ చరిత్ర



మదనపల్లె : పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిసార్‌అహ్మద్, నాయకులు



బి.కొత్తకోటలో..



పీలేరులో..

మదనపల్లె : అణగారిన ప్రజల హక్కుల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని మదనపల్లె వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ కొనియాడారు. నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని నక్కలదిన్నె బీసీ హాస్టల్‌లో జన్నే రాజేంద్రనాయుడు అధ్యక్షతన పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్‌లో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మార్కెట్‌యార్డు వద్ద పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాలమహానాడు ఆధ్వర్యంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆధునిక యుగ వైతాళికుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని బాస్ వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్ అన్నారు.

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

పీలేరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని వివిధ సంఘాల నాయకులు కొనియాడారు. జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘాల నాయకులు శ్రీనివాసులు, ధరణి కుమార్, సుధాకర, బలరామ్, ముల్లంగి చంద్రయ్య, సుభాష్, మల్లికార్జున పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు పూలే

బి.కొత్తకోట: సాంఘిక దురాచారాలను అరికట్టేందుకు, ప్రజల్లో సామాజిక చైతన్యం తెచ్చిన జ్యోతిరావు పూలే సామాజిక విప్లవకారుడని ఎంఈఓలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక జ్యోతిచౌక్‌లో బాస్, బహుజనుల ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా జరిపారు. పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. సచిన్, సింగన్న, నరసింహులు, అయూబ్, బండి రమణ, సిద్ధప్ప, కుడుము శరత్, వేణుగోపాల్‌రెడ్డి, నక్కా మహేష్, మస్తాన్, జయరాం పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: సమసమాజ స్థాపనకు అలుపెరగని కృషితో నేటి తరానికి మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శంగా నిలిచారని హెచ్ఎం రెడ్డప్పరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఆనంద్, టీచర్లు వెంకట్‌కుమార్, పద్మావతి, కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.